క్లుప్తంగా

ఘనంగా బురకాయల అంకమ్మ విగ్రహ ప్రతిష్ట



పిట్టలవానిపాలెం (కర్లపాలెం): మండల పరిధిలోని దేగలవానిపాలెంలో బురకాయల అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట సోమవారం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన దేగలవాని వంశస్తులు అమ్మవారికి నూతనంగా ఆలయం నిర్మించారు. విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా శాంతిహోమాలు, విశేష పూజలు నిర్వహించారు. బురకాయల అంకమ్మ విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాల పరిశీలన



వేమూరు: ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రైవేటు లే అవుట్, జంపని గ్రామంలోని కుమ్మరి కుంటను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేమూరు గ్రామానికి చెందిన తాళ్లూరు మోహన్ కృష్ణ ప్రైవేటు లే అవుట్ నిర్వాహకులు ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురి చేశారంటూ అర్జీ అందజేశారు. దీంతో ఆమె లే అవుట్‌లలు పరిశీలించారు. వేమూరులో ప్రభుత్వ స్థలాలను సిబ్బందితో సర్వే చేయించామని అన్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, వీఆర్వోలు జితేంద్ర, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మోహన్‌దాస్‌కు ఘన నివాళి



తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొడాలి మోహన్‌దాస్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని డాక్టర్ మోహన్‌దాస్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్. సురేంద్ర 'వాస్కులర్‌సర్జరీ స్మాల్ బిగినింగ్స్ టు నౌ ఫ్లరిషింగ్' అన్న అంశం పై డాక్టర్ మోహన్‌దాస్ స్మారకోపన్యాసం చేశారు. ఐఎంఏ అధ్యక్షుడు అనిల్ కుమార్, డాక్టర్ పావని, డాక్టర్ శ్యాంప్రసాద్ బంగారు డాక్టర్ సురేంద్రకు పతకాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ భానుప్రసాద్, డాక్టర్ పాలడుగు ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎంవీ సత్యనారాయణ, డాక్టర్ కోటేశ్వరప్రసాద్, డాక్టర్ నీలిమ, డాక్టర్ విజయ వాణి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య.. తప్పని ఇక్కట్లు



పొన్నూరు: పట్టణంలోని 27వ వార్డులో లో ఓల్టేజీ కారణంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొంతకాలంగా వార్డులో విద్యుత్ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పలుసార్లు విద్యుత్ కార్యాలయంలో సమస్యపై వినతిపత్రాలు అందజేసినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వార్డులోని న్యాయవాది రాధిక కార్యాలయం పక్క వీధిలో సుమారు 15 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీధిలో ఉన్న రెండు విద్యుత్ స్తంభాల నుంచి సింగిల్ ఫేజ్ ద్వారా నివాసాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే 3 ఫేజ్ లైను లేని కారణంగా అదనపు భారం పడినప్పుడు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట్ కూడా ఏర్పడి ఇళ్లలో ఫ్యూజులు, వైర్లు కాలిపోతున్నాయని వాపోతున్నారు. వేసవికాలం దృష్ట్యా ఏసీల వినియోగం పెరగడంతో వాటికి సరిపడా విద్యుత్ సరఫరా జరగడం లేదని అంటున్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నా, సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ కొరతతో ప్రజల ఇక్కట్లు

- అర్ధరాత్రుళ్లు కరెంటు కోత
- ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారుల అవస్థలు



మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్

వేమూరు: అర్ధరాత్రి వేళ కరెంట్ కోతతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అందులోనూ వేసవి కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కొరతపై అధికారులు పట్టించుకోవడం లేదని.. విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 17 గ్రామాలు ఉండగా.. 15 వేల మందికి పైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. గత మూడు రోజుల నుంచి రాత్రుల సమయంలో కరెంట్ రెండు, మూడు గంటల చొప్పున తీసేయడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వినియోగదాలు అంటున్నారు. ఇటీవల శనివారం రాత్రి 10 గంటలకు తీసేసిన కరెంట్ తిరిగి రాత్రి 11.30 గంటలకు వచ్చిందన్నారు. ఆదివారం రాత్రి 12 గంటలకు పోయిన కరెంట్ మరలా తెల్లవారుజామున 3 గంటలకు ఇచ్చారని.. వృద్ధులు, చంటి పిల్లలు ఉన్న వారు నానా అవస్థలు పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కొరత సమస్యను తెలుసుకునేందుకు సబ్ స్టేషన్‌కు కాల్ చేసినా ఎలాంటి సమాధానం చెప్పడం లేదని విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అధికం..

గత ప్రభుత్వం విద్యుత్ కొరత లేకుండా చేసేందుకు కొత్త విద్యుత్ సబ్ స్టేషనులను ఏర్పాటు చేశారు. కొత్త కరెంట్ లైనులు వేశారు. కరెంట్ స్తంభాలను దెబ్బతిన్న ప్రాంతాల్లో తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. గతంలో ప్రజలకు విద్యుత్ సమస్య రాకుండ చూసేందుకు ప్రతి గ్రామ సచివాలయంలో విద్యుత్ శాఖ సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా ప్రజలు జీవించేవాళ్లు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ సమస్య గురించి పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో రోజూ రాత్రి కరెంట్ కోత సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రుల సమయంలో విద్యుత్ కొరత విధిస్తే మరుక్షణం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తామని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులను హెచ్చరిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..



మండలంలో రోజూ రాత్రి సమయంలో విద్యుత్ కొరత నెలకొంటుంది. విద్యుత్ కొరత గురించి విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి విద్యుత్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి.

– ఆలపర్తి రవికుమార్, జంపని

ఫోన్ చేసినా స్పందించడం లేదు..



విద్యుత్ సమస్యను సబ్ స్టేషన్ పరిధిలోని సిబ్బంది పట్టించుకోవడం లేదని వినియోగదారులు అంటున్నారు. రాత్రుల సమయంలో విద్యుత్ వినియోగదారులు సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసినా వారు స్పందించడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

– పిల్లి శ్యామ్, వేమూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, మున్సిపల్ కార్మికులు

రేపల్లె రూరల్: రేపల్లె మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆమరణ దీక్ష చేపడుతున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు, సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీలు తెలిపారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలసి ధర్నా నిర్వహించారు. నాగాంజనేయులు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులకు గతంలో ఎన్నో సార్లు తెలిపినా పట్టింపు లేదని ఆరోపించారు. అధికారుల వేధింపులు తాళలేక కార్మికులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నుంచి కార్మికులు తమ విధులను బహిష్కరిస్తామని, కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ దీక్ష కొనసాగుతుందని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐక్యంగా పోరాడతారని బాలాజీ అన్నారు. ఏఐయూటీయూసీ నాయకులు సిరంశెట్టి శ్రీనివాసరావు, చొక్కాకుల శివశంకర్, కార్మికులు, కుసుమ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌జెడ్ నిబంధనలు అమలయ్యేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు మేకల ప్రసాద్, పక్కన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల: మండలంలోని రామచంద్రపురంలో సీఆర్‌జెడ్ నిబంధనలు అమలు జరిగేలా చూడాలని మత్స్యకారులు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు సోమవారం మత్స్యకారులు, న్యూడెమోక్రసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. 200 కుటుంబాలు ఉన్న మత్స్యకారులు ప్రైవేటు రిసార్ట్స్, రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సీఆర్‌జెడ్ నిబంధనలు అమలు జరిగేలా చూడాలని కోరారు. సముద్ర ఆటు, పోటుల నుంచి 200 మీటర్ల వరకు సీఆర్‌జెడ్ నిబంధనలు ఉండగా వాటిని పూర్తిగా తుంగలో తొక్కివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులు కనీసం బోట్లు పెట్టుకునేందుకు కూడా అవకాశం లేదని వాపోయారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. న్యూడెమోక్రసీ జిల్లా సహాయకార్యదర్శి మేకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని వినతి



ఏఓ సీతారత్నంకు వినతి పత్రం అందిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

బాపట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నప్పటికీ ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడం బాధాకరమని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం కలెక్టరేట్ ఏఓ సీతారత్నంకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. ప్రసాద్ మాట్లాడుతూ.. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి హామీని అమలు చేయలేదని అన్నారు. తల్లికి వందనం, ఉజ్వల్ పథకం కింద నిరుపేదలకు ఉచిత గ్యాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ప్రతి నెల రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీని పట్టించుకోలేదని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు ప్రతి రైతుకు అందిస్తామని చెప్పిన చంద్రబాబు నేడు హామీని విస్మరించారని అన్నారు. ఈ పథకాలన్నీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు హాఫిజుల్లా, బిజ్జాన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకం



శ్రీమన్నారాయణను సత్కరిస్తున్న వ్యవసాయ అధికారులు

రేపల్లె రూరల్: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.విజయబాబు అన్నారు. ప్రకతి వ్యవసాయంపై మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వ్యవసాయ సిబ్బంది, రైతులకు నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు సాగు మొదలు పెట్టిన సమయంలో దేశవాళీ విత్తనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గించుకోవచ్చునని అన్నారు. పురుగు మందుల వినియోగంతో వాతావరణ కాలుష్య సమస్య ఎక్కువ అవుతోందని.. ప్రకృతి వ్యవసాయంతో ఈ సమస్యను అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప్పూడి గ్రామ అభ్యుదయ రైతు శ్రీమన్నారాయణ ప్రకృతి వ్యవసాయంపై తన అనుభవాలను తెలియజేశారు. అనంతరం రైతు శ్రీమన్నారాయణ సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, మండలంలోని యానిమేటర్లు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు మూడు అర్జీలు

రేపల్లెరూరల్: సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి కోరారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె అర్జీలు స్వీకరించి మాట్లాడారు. మూడు అర్జీలు అందాయన్నారు. ఆక్రమణకు గురైన స్థలంలో ఆక్రమణలను తొలగించాలని నల్లూరు గ్రామానికి చెందిన దీవి హరికృష్ణ, తన స్థలంలో అక్రమంగా సీసీ రోడ్డు నిర్మించారని.. తగిన నష్ట పరిహారం చెల్లించాలని నిజాంపట్నం మండలంలోని సుబ్రహ్మణ్యం, తన పొలాన్ని ఆన్‌లైన్ చెయ్యాలని అడవులదీవిలోని షేక్ జిలానీ అర్జీలు ఇచ్చినట్లు అధికారి పేర్కొన్నారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని ఆమె అన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ మేనేజర్ అన్నపరెడ్డి రమేష్



బీమా సొమ్మును కుటుంబ సభ్యులు అందజేస్తున్న బీఎం రమేష్

కొల్లిపర: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు అందిస్తున్న వివిధ రకాల సేవలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ మేనేజర్ అన్నపరెడ్డి రమేష్ అన్నారు. సోమవారం ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం ద్వారా కొల్లిపర గ్రామంలోని అబ్బగాని తిరుపతమ్మ క్యాన్సర్ వ్యాధితో మృతి చెందడంతో మృతి చెందిన మీకు బ్యాంకులో ఖాతా ఉండటంతో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం ద్వారా రెండు లక్షల రూపాయలు చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇటువంటి పథకాల ప్రయోజనాలు బ్యాంకు సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఎటువంటి అనుమానాలు ఉన్న బ్యాంక్ ఎదురుగా ఉన్న సేవా కేంద్రంలో సిబ్బందిని అడిగి తెలుసుకుని ప్రతి ఒక్కరూ భీమా సభ్యత్వం పొంది ఇటువంటి ప్రమాదం సమయంలో బీమా సొమ్మును అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేవా కేంద్రం నిర్వాహకుడు ఉదయ భాస్కర్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మండలంలోని అధికారులు ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశానికి విధిగా హాజరు కావాలన్నారు.

పొన్నూరు మండలంలో రేపు..

పొన్నూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారంతో పాల్గొనాలని కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కర్లపాలెం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్షార్హులవుతారని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గోపీనాథ్ మాట్లాడుతూ.. చిన్న వయసులో వివాహం చేస్తే జరిగే వైఫల్యాలను వివరించారు. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుందరమ్మ, జెడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈవో మనోరంజని, హెచ్ఎం విజయ భాస్కర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత్వమా.. నీ జాడెక్కడా?

- పనికిరాని వస్తువులా ఆసుపత్రి గదిలో వృద్ధుడు
- వంటిపై నూలుపోగు లేకుండా పడివున్న అభాగ్యుడు
- వస్త్రం కప్పి, ఆహారం తినిపించిన 'హెల్పింగ్ సోల్జర్స్'



ఆహారం తినిపిస్తున్న ఇనయతుల్లా

తెనాలి: అతడో అరవై ఏళ్లకు పైగా వయసు కలిగిన వృద్ధుడు... వంటిమీద నూలుపోగు లేదు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓ గదిలో పనికిరాని మంచాలు, ఇతర వస్తువుల్లాగే పడివున్నాడు. పెద్దగా కేకలు వేస్తున్నాడు. గత మూడురోజులుగా ఇదే పరిస్థితి. అనాథ శవాలకు అంత్యక్రియలతో సహా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండే పట్టణానికి చెందిన స్వచ్ఛంద సంస్థ 'హెల్పింగ్ సోల్జర్స్' వ్యవస్థాపకుడు ఇనయతుల్లా సోమవారం ఆసుపత్రిని సందర్శించినపుడు ఈ కేకలు విన్నారు. తలుపుకు గల అద్దంలోంచి చూసినపుడు కిందపడిపోయి ఉన్న వృద్ధుడి పరిస్థితిని గమనించాడు. తలుపులు తీసి, అతడిని పలకరించాడు.

తనది బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతవరం అని చెప్పాడు. పేరు దావులూరి రాధాకృష్ణమూర్తి అనీ, తనకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారని వివరాలను తెలిపాడు. ఇక్కడ ఎందుకు వున్నావు అని ప్రశ్నిస్తే, వివరాలేమీ చెప్పలేకపోయాడు. అతడి పరిస్థితి చూసి జాలిపడిన ఇనయతుల్లా తన స్నేహితుడు శివతో కలిసి అతడికి వస్త్రం కప్పారు. ఇడ్లీలు తీసుకొచ్చి తినిపించారు. ఓఆర్ఎస్, మంచినీరు ఇచ్చారు. ఏదేమైనా పనికిరాని వస్తువులాగ, బతికున్న మనిషిని శవంలా పడేయటం మానవత్వం కాదని ఇనయతుల్లా అన్నారు. కుటుంబ సభ్యులు ఉన్నారని చెబుతున్నందున, వారిని పిలిపించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

ఇదే విషయమైన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ గత నెలరోజులుగా తరచూ అతడిని ఎవరో ఒకరు తీసుకొచ్చి ఆసుపత్రిలో చేరుస్తున్నారని చెప్పారు. బట్టలు కట్టించినా, తీసిపడేస్తున్నాడని తెలిపారు. పెద్దపెద్దగా కేకలు వేస్తూ, తలుపు అద్దాలు పగులగొడుతున్నాడని తెలిపారు. రోగులపై దాడిచేస్తారనే భయంతో సిబ్బంది ఎవరైనా లోపల పెట్టి తలుపులు వేశారేమో విచారిస్తానని చెప్పారు.

ఉపాధి హామీ వర్కర్లకు పనిముట్లు ఏవీ?

కార్మికుల ఆవేదన



వర్కర్లతో మాట్లాడుతున్న అప్పారావు

తెనాలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసేవారికి పనిముట్లు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డితో కలిసి సోమవారం రూరల్ మండలం అంగలకుదురు గ్రామంలో సోమవారం ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి పని చేస్తున్న కార్మికులను పలకరించారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. గత మూడేళ్లుగా తాము ఉపాధి హామీ పనులకు వస్తున్నామని, ఇంతవరకు పనిముట్లు అందజేయలేదని తెలిపారు. అలాగే మెడికల్ కిట్, పలుగు, పారకు డబ్బులు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ పనిచేసే కూలీలకు అధికారులు మజ్జిగ పంపిణీ చేస్తే బాగుంటుందని సూచించారు. ఈమని అప్పారావు, మలకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని, అందులో భాగంగానే నిధులు తగ్గించేసిందని ఆరోపించారు. రాష్ట్రంలోను, జిల్లాలోను ఉపాధి హామీ పని చేసిన వారికి డబ్బులు వెంటనే చెల్లించడం లేదన్నారు. కారణం అడిగితే బ్యాంకులో డబ్బులు పడటం లేదని అధికారులు చెబుతున్నారని, ఇది సరైనది కాదన్నారు. వెంటనే బకాయి డబ్బులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనిచేసేవారికి పనిముట్లు అందజేయాలని గతంలో వలె పలుగు , పారకు డబ్బులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే సమ్మర్ అలవెన్స్ కూడా ఇవ్వాలని కోరారు.

చేతి వృత్తులతో జీవనోపాధి

అమర్తలూరు(వేమూరు): విద్యార్థులు చదువుతో పాటు చేతి వృత్తులు నేర్చుకోవాలని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరీక్షణ రావు అన్నారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం చేతి వృత్తులు నేర్పించామని.. మండల కేంద్రంలోని సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ తరుపున 10 రోజులు రహ్మతుల్లా మెకానిక్ షాపులో ఆటోమోటివ్ ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెఫ్‌పై మరో చెఫ్ బీరు సీసాతో దాడి

తెనాలిరూరల్: హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్న వ్యక్తిపై మరో చెఫ్ బీరు సీసాతో దాడి చేసి గాయపరిచిన ఘటన ఆదివారం రాత్రి పొద్దుపోయాక జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ హోటల్‌లో వినుకొండ, విజయనగరంకు చెందిన ఇద్దరు వ్యక్తులు చెఫ్‌లుగా పని చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక మద్యం తాగి ఘర్షణ పడ్డారు. విజయనగరంకు చెందిన చెఫ్‌పై వినుకొండకు చెందిన చెఫ్ బీరు సీసాతో దాడి చేయడంతో మోచేతి కింద తీవ్ర గాయమైంది. ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ పంపారు.

జేడీ వాన్స్ పర్యటనకు వ్యతిరేకంగా నిరసన



ప్రదర్శనగా వస్తున్న రైతుసంఘ సభ్యులు

తెనాలి: 'భారతదేశం అమ్మకానికి సిద్ధంగా లేదు... గో బ్యాక్ జేడీవాన్స్' అంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, తెనాలి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హయ్యర్‌పేటలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ పర్యటనతో వ్యవసాయరంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడుతుందని, ఆయన రాకకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేయాలని అఖిల భారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) పిలుపు ప్రకారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆజ్ఞలను శిరసావహించి, భారత ప్రధాని నరేంద్రమోదీ దిగుమతి సుంకాలను తగ్గిస్తే అమెరికా ఉత్పత్తులు దిగుమతి అవుతాయన్నారు. ఫలితంగా భారత పాడి పరిశ్రమ కుదేలవుతుందని చెప్పారు. గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్, బాదం, పిస్తా, ఆపిల్, వాల్‌నట్‌తో సహా ఉద్యానపంటల రైతులు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలు అమెరికాకు దీటుగా వ్యవహరిస్తుంటే, మోదీ ప్రభుత్వం లొంగిపోయి సంతకాలు చేయటం తగదన్నారు.

దేవతామూర్తులకు పంచామృతాభిషేకం



తెనాలి: స్థానిక మారీస్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీకోదండ రామస్వామి వారి దేవస్థానం (రామభక్త అప్పల స్వామి గుడి)లో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం 16 రోజుల పండగ జరిపారు. దేవతామూర్తులకు భక్తులచే పంచామృత అభిషేకం, విశేష అర్చన పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు, ధర్మకర్తలు కూనపల్లి నారాయణస్వామి, లంక శివ ఆంజనేయప్రసాద్, మర్రిపూడి రాంబాబు దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు దినమణి ధనుష్ సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు